24-08-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - తండ్రి మీకు సంగమములో ఏ స్మృతులనైతే ఇప్పించారో, వాటిని స్మరణ చేసినట్లయితే సదా హర్షితంగా ఉంటారు"

ప్రశ్న:- సదా తేలికగా ఉండేందుకు యుక్తి ఏమిటి? ఏ సాధనాన్ని అలవరచుకున్నట్లయితే సంతోషంలో ఉండగలుగుతారు?

జవాబు:- సదా తేలికగా ఉండేందుకు ఈ జన్మలో ఏయే పాపాలైతే జరిగాయో, వాటన్నింటినీ అవినాశీ సర్జన్ ముందు పెట్టండి. ఇకపోతే జన్మజన్మాంతరాల పాపాలు ఏవైతే తలపై ఉన్నాయో, వాటి కొరకు స్మృతియాత్రలో ఉండండి. స్మృతి ద్వారానే పాపాలు తొలగుతాయి, అప్పుడు సంతోషము ఉంటుంది. తండ్రి స్మృతితో ఆత్మ సతోప్రధానంగా అవుతుంది.

ఓం శాంతి. మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి అర్థం చేయిస్తున్నారు - మీకు ఈ స్మృతి కలిగింది, మేము ఆది సనాతన దేవీ-దేవతా ధర్మానికి చెందినవారము, మేము రాజ్యం చేసేవారము, మేము తప్పకుండా విశ్వాధిపతులుగా ఉండేవారము, ఆ సమయంలో ఇంకే ధర్మమూ లేదు, మేమే సత్యయుగము నుండి మొదలుకుని జన్మలు తీసుకుంటూ 84 జన్మల చక్రాన్ని పూర్తి చేసాము. మొత్తం వృక్షమంతా స్మృతిలోకి వచ్చింది. మనం దేవతలుగా ఉండేవారము, మళ్ళీ రావణ రాజ్యంలోకి రావడంతో ఇక దేవీ-దేవతలుగా పిలవబడేందుకు అర్హతను కోల్పోయాము, అందుకే ధర్మమే పేరుగా భావించాము. ఇంకెవ్వరి ధర్మమూ ఇలా మారదు. ఉదాహరణకు క్రైస్టుది క్రిస్టియన్ ధర్మము, బుద్ధునిది బౌద్ధ ధర్మమే కొనసాగుతూ వస్తుంది. బుద్ధుడు ఫలానా సమయంలో ధర్మ స్థాపన చేసారు అన్నది అందరి బుద్ధిలోనూ ఉంది. హిందువులకు తమ హిందూ ధర్మము ఎప్పటి నుండి ప్రారంభమయ్యింది, దానిని ఎవరు తయారుచేసారు అని తమ ధర్మము గురించే తెలియదు. లక్షల సంవత్సరాలు అని అనేస్తారు. మొత్తం సృష్టి చక్రము యొక్క జ్ఞానం పిల్లలైన మీకే ఉంది. దీనినే జ్ఞానము-విజ్ఞానము అని అంటారు. వారు విజ్ఞాన భవన్ అన్న పేరును పెట్టారు కానీ తండ్రి దాని అర్థాన్ని ఇలా వివరిస్తున్నారు - జ్ఞానము మరియు యోగము, అది కూడా రచయిత మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానము. ఇంతకుముందు దాని గురించి మాకు కూడా తెలియదు, మేము నాస్తికులుగా ఉండేవారము అని ఇప్పుడు మీరు భావిస్తారు. సత్యయుగములోనైతే ఈ జ్ఞానము ఉండదు. ఇప్పుడు మీకు టీచర్ చదివిస్తున్నారు. చదువుకున్నాక మీకు రాజ్య భాగ్యము లభిస్తుంది ఎందుకంటే మీకు ఉండేందుకు కొత్త సృష్టి కావాలి. ఈ పాత సృష్టిలోనైతే పవిత్రమైన దేవీ-దేవతలు పాదం మోపలేరు. తండ్రి వచ్చి మీ కోసం పాత ప్రపంచాన్ని వినాశనం చేసి కొత్త ప్రపంచాన్ని స్థాపన చేస్తారు. మన కొరకు వినాశనం తప్పకుండా జరగాలి. కల్ప-కల్పాంతరాలూ మనం ఈ పాత్రను అభినయిస్తాము. బాబా అడుగుతారు - ఇంతకుముందు ఎప్పుడైనా కలిసారా? అప్పుడు - బాబా, ప్రతి కల్పమూ కలుస్తాము, మీ నుండి రాజ్య భాగ్యాన్ని తీసుకునేందుకు కలుస్తాము అని అంటారు. కల్ప పూర్వము కూడా అనంతమైన సుఖము యొక్క రాజ్య భాగ్యము లభించింది. ఈ విషయాలన్నీ ఏవైతే స్మృతిలోకి వచ్చాయో, ఇప్పుడు వాటి స్మరణ జరుగుతూ ఉండాలి, దీనినే బాబా స్వదర్శన చక్రము అని అంటారు. మనం మొదట సతోప్రధానముగా ఉండేవారము. ప్రతి ఆత్మకూ తమ-తమ పాత్ర లభించి ఉందని కూడా మీకు స్మృతిలోకి వచ్చింది. ఆత్మయైన మనం చిన్నగా, అవినాశీగా ఉంటాము, అందులో పాత్ర కూడా అవినాశీగా ఉంది, అది నడుస్తూనే ఉంటుంది. ఇది తయారై-తయారుచేయబడి, తయారవుతూ ఉంది... ఇందులో కొత్త విషయమేదీ కలపడం లేక తొలగించబడడం అనేది జరగదు. ఎవ్వరూ మోక్షాన్ని పొందలేరు. కొందరు ముక్తిని కోరుకుంటారు, ముక్తి పేరు, మోక్షము పేరు. ఇది కూడా స్మృతిలో ఉంచుకోవాలి. స్మృతిలో ఉన్నట్లయితే ఇతరులకు కూడా స్మృతిని ఇప్పిస్తారు. మీ పనే ఇది. తండ్రి ఏదైతే స్మృతిలోకి తీసుకువచ్చారో దానిని మళ్ళీ ఇతరులకు కూడా స్మృతిని కలిగించండి, అప్పుడు ఉన్నత పదవిని పొందగలుగుతారు. ఉన్నత పదవిని పొందేందుకు చాలా కష్టపడాలి. ముఖ్యమైన శ్రమ యోగానికి సంబంధించినది. ఇది స్మృతియాత్ర, దీనిని తండ్రి తప్ప ఇంకెవ్వరూ నేర్పించలేరు. ఇప్పుడు మీరు మనుష్యుల నుండి దేవతలుగా అయ్యే చదువును చదువుకుంటారు. మనం మళ్ళీ కొత్త ప్రపంచములోకి వెళ్తామని మీకు తెలుసు. దాని పేరే అమరలోకము. ఇది మృత్యులోకము. ఇక్కడైతే అకస్మాత్తుగా కూర్చుని, కూర్చుని ఉండగానే మృత్యువు వచ్చేస్తుంది. అక్కడైతే మృత్యువు యొక్క నామరూపాలే ఉండవు ఎందుకంటే వాస్తవానికి ఆత్మనైతే కాలుడు తినలేడు. ఇదేమైనా తీపి పదార్థమా. డ్రామానుసారంగా ఎప్పుడైతే సమయం వస్తుందో అప్పుడు ఆత్మ వెళ్ళిపోతుంది. ఏ సమయంలో ఎవరు వెళ్ళవలసి ఉంటుందో వారు వెళ్తారు. కాలుడేమీ పట్టుకోడు. ఆత్మ ఒక శరీరాన్ని వదిలి ఇంకొక శరీరాన్ని

తీసుకుంటుంది, అంతేకానీ కాలుడు అంటూ ఎవ్వరూ లేరు. కథలు అలా తయారుచేసారు. అది అమరలోకము, అక్కడ నిరోగీ శరీరము ఉంటుంది. సత్యయుగములో భారతవాసుల ఆయువు కూడా ఎక్కువగా ఉండేది, వారు యోగులుగా ఉండేవారు. యోగికి మరియు భోగికి ఉన్న తేడా కూడా ఇప్పుడు తెలుస్తుంది. మీ ఆయువు వృద్ధి అవుతోంది. ఎంతగా మీరు యోగములో ఉంటారో అంతగా పాపాలు భస్మమవుతాయి మరియు పదవి కూడా ఉన్నతమైనది లభిస్తుంది, ఆయుష్షు కూడా ఎక్కువగా ఉంటుంది. యథా రాజా రాణి ఆయుష్షును పూర్తి చేసుకుని శరీరాన్ని వదులుతారు, ప్రజల విషయములో కూడా అలాగే జరుగుతుంది. కానీ పదవిలో తేడా ఉంటుంది.

ఇప్పుడు తండ్రి మీకు చెప్తున్నారు - స్వదర్శన చక్రధారీ పిల్లలూ, ఈ అలంకారాలు మీవే. గృహస్థ వ్యవహారములో ఉంటూ కమలపుష్ప సమానముగా మీరు ఉంటారు. మీరు తప్ప ఇంకెవ్వరూ అలా ఉండలేరు. ఈ జన్మలో మనం ఎన్ని పాపాలు చేసాము అన్నది కూడా స్మృతిలోకి వచ్చింది, అందుకే బాబా అంటారు, వాటన్నింటినీ అవినాశీ సర్జన్ ముందు ఉంచినట్లయితే తేలికగా అవుతారు. ఇకపోతే జన్మజన్మాంతరాల పాపాలేవైతే తలపై ఉన్నాయో, వాటి కొరకు యోగములో ఉండాలి. యోగము ద్వారానే పాపాలు అంతమవుతాయి మరియు సంతోషము కూడా ఉంటుంది. తండ్రి స్మృతి ద్వారా సతోప్రధానులుగా అవుతారు. మనం స్మృతి ద్వారా ఈ విధముగా అవుతాము అని తెలిస్తే మరి ఇక ఎవరు స్మృతి చేయరు? కానీ ఇది యుద్ధ మైదానము, ఇంత ఉన్నత పదవిని పొందేందుకు కష్టపడవలసి ఉంటుంది. ఇది కూడా పిల్లలకు స్మృతిలోకి వచ్చింది - అనంతమైన తండ్రి ద్వారా మేము ఉన్నతోన్నతమైన వారసత్వాన్ని తీసుకుంటాము, కల్ప-కల్పమూ తీసుకుంటాము అని. మీ వద్దకు ఎంతోమంది వస్తారు, వచ్చి మన్మనాభవ మహామంత్రాన్ని తీసుకుంటారు. మన్మనాభవ అంటే అర్థము - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి. ఇది మహాన్ ఆత్మలుగా అయ్యేందుకు మహామంత్రము. వారేమీ మహాత్ములు కారు. మహాత్మ అని వాస్తవానికి శ్రీకృష్ణుడిని అనడం జరుగుతుంది ఎందుకంటే వారు పవిత్రమైనవారు. దేవతలు సదా పవిత్రముగా ఉంటారు. దేవతలది ప్రవృత్తి మార్గము, సన్యాసులది నివృత్తి మార్గము. స్త్రీలైతే అలా కష్టాలు పడలేరు. ఇప్పుడు ఈ కలియుగములో ఈ లోపాలన్నీ ఉంటున్నాయి. స్త్రీలను కూడా సన్యాసినులుగా చేసి తీసుకుపెళ్తారు. ఎంతైనా వారి పవిత్రతపై భారత్ నిలిచి ఉంటుంది. ఎలాగైతే పాత ఇంటికి సున్నము మొదలైనవి వేస్తే అది కొత్తగా అయినట్లు ఉంటుంది కదా. అలాగే ఈ సన్యాసులు కూడా కొంత సున్నం వేసి కొంత రక్షిస్తారు. కానీ తండ్రి అంటారు, ఆ ధర్మమే వేరు, వారు పవిత్రంగా ఉంటారు.

భారత ఖండములోనే ఇన్ని దేవీ-దేవతల మందిరాలు, భక్తి మొదలైనవి ఉన్నాయి. ఇది కూడా ఒక ఆట, దీని వృత్తాంతాన్ని మీరు తెలియజేస్తారు. భక్తి మార్గము కొరకు ఇవన్నీ కూడా కావాలి కదా. ఒక్క శివునికే ఎన్ని పేర్లను పెట్టేసారు. ప్రతి పేరుపైన ఒక మందిరం తయారవుతూ వచ్చింది. లెక్కలేనన్ని మందిరాలున్నాయి. ఎంత ఖర్చవుతుంది. ఎంతైనా అర్ధకల్పం యొక్క సుఖము లభిస్తుంది, అంతే. ఎంతో డబ్బు ఖర్చు పెడతారు, విగ్రహాలు విరిగిపోతూ ఉంటాయి. అక్కడైతే మందిరాలు మొదలైనవాటి అవసరం లేదు. అర్ధకల్పం భక్తి నడుస్తుందని, మళ్ళీ అర్ధకల్పం భక్తి అన్న మాటే ఉండదని కూడా ఇప్పుడు స్మృతిలోకి వచ్చింది. తండ్రి ఈ వెరైటీ వృక్షము యొక్క స్మృతిని ఎంతగా కలిగిస్తూ ఉంటారు. కేవలం కలియుగ ఆయువే 40,000 సంవత్సరాలున్నట్లయితే మరి క్రిస్టియన్లు మొదలైనవారి ఆయువు కూడా ఎంతగానో పెరిగిపోవాలి. తండ్రి అర్థం చేయిస్తారు, క్రిస్టియన్ ధర్మానికి ఇంతే లిమిట్ ఉంది. క్రైస్టు వచ్చి ఇంత సమయం అయ్యిందని, ఫలానావారు వచ్చి ఇంత సమయం అయ్యిందని, వారు ధర్మ స్థాపన చేసారని తెలుసు. కానీ మళ్ళీ ఎప్పుడు వెళ్తారు? అది తెలియదు. కల్పం ఆయువునే పొడిగించేసారు. ఇక్కడ వినాశనము కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని ఇప్పుడు మీకు తెలుసు. వారిది సైన్స్, మీది సైలెన్స్. మీరు ఎంతగా సైలెన్స్ లోకి వెళ్తారో అంతగా వారు వినాశనం కొరకు మంచి-మంచి వస్తువులను తయారుచేస్తూ ఉంటారు. రోజురోజుకు సూక్ష్మమైన వస్తువులను తయారుచేస్తూ ఉంటారు. మీకు లోలోపల ఎంతో సంతోషము కలుగుతుంది - బాబా అయితే మా కొరకు కొత్త ప్రపంచాన్ని తయారుచేయడానికి వచ్చారు కావున ఇప్పుడు మేము పాత ప్రపంచములో ఎందుకు ఉంటాము. ఇది బాబా యొక్క అద్భుతము. బాబా, మీ స్వర్గ స్థాపన చేసే విధి అద్భుతము. ఇప్పుడు మీకు మొత్తమంతా స్మృతిలోకి వచ్చింది. వారికైతే రచయిత మరియు రచన ఆదిమధ్యాంతాల గురించి తెలియనే తెలియదు. అది మీకు తెలుసు. మీరు ఎంత ప్రకాశములో ఉన్నారు. మనుష్యులైతే ఘోర అంధకారములో ఉన్నారు. తేడా ఉంది కదా. జ్ఞాన అంజనాన్ని సద్గురువు ఇచ్చినప్పుడు అజ్ఞానాంధకారము వినాశనమవుతుంది. భక్తిలోని వారికి జ్ఞానము గురించి తెలియదు. ఇప్పుడు మీకు భక్తి గురించి కూడా తెలుసు, అలాగే జ్ఞానము గురించి కూడా తెలుసు. భక్తి ఎప్పుడు ప్రారంభమవుతుంది, మళ్ళీ ఎప్పుడు పూర్తవుతుంది అన్నది మొత్తమంతా స్మృతిలోకి వచ్చింది. తండ్రి

జ్ఞానాన్ని ఎప్పుడు ఇస్తారు, అది ఎప్పుడు పూర్తవుతుంది, అంతా స్మృతిలో ఉంది. నంబరువారుగానైతే ఉన్నారు. కొందరికి ఎక్కువ స్మృతి ఉంది, కొందరికి తక్కువగా ఉంది. ఎవరికైతే ఎక్కువ స్మృతి ఉంటుందో, వారు ఉన్నత పదవిని పొందుతారు. స్మృతిలో ఉంటేనే ఇతరులకు కూడా అర్థం చేయిస్తారు. ఇది అద్భుతమైన స్మృతి కదా. ఇంతకుముందు మీ బుద్ధిలో ఏముండేది. భక్తి, జప-తపాదులు, తీర్థాలు చేయడం, తల వంచి నమస్కరించడం, మొత్తం నుదురు అంతా అరిగిపోయింది. భక్తి యొక్క స్మృతికి మరియు జ్ఞానానికి ఎంత తేడా ఉంది. మీకు ఇప్పుడు భక్తి గురించి తెలుసు ఎందుకంటే మొదటి నుండి భక్తి చేసారు. మనం మొట్టమొదట శివుని భక్తిని చేసామని, ఆ తర్వాత దేవతలది చేసామని మీకు తెలుసు. ఇంకెవ్వరికీ ఈ స్మృతి లేదు, మీకు రచన ఆదిమధ్యాంతాలు, భక్తి మొదలైనవాటి స్మృతి అంతా ఉంది. అర్ధకల్పం భక్తి చేస్తూ-చేస్తూ దిగిపోతూనే వచ్చారు.

ఇప్పుడైతే దుఃఖపు పర్వతాలు పడనున్నాయి. అవి పడకముందే మేము స్మృతియాత్ర ద్వారా వికర్మలను వినాశనం చేసుకోవాలి అని పిల్లలైన మీరు పురుషార్థము చేయాలి. అందరికీ మీరు ఇదే అర్థం చేయిస్తారు, మీ వద్దకు వేలాదిమంది వస్తారు. సోదరీ-సోదరులకు దారిని చూపించేందుకు మీరు కృషి చేస్తారు. జ్ఞానము మరియు భక్తి యొక్క స్మృతి కలిగింది అనగా మీరు మొత్తం డ్రామాను నంబరువారు పురుషార్థానుసారముగా తెలుసుకున్నారు. ఎవరు ఎంత బాగా తెలుసుకుంటారో వారు అంత బాగా అర్థం చేయించగలరు కూడా. అర్థం చేయించడమనేది పిల్లలే చేయాలి. సన్ షోస్ ఫాదర్ (కొడుకు తండ్రిని ప్రత్యక్షం చేస్తాడు) అన్న గాయనము కూడా ఉంది. తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తారు, పిల్లలు మళ్ళీ ఇతర సోదరులకు అర్థం చేయిస్తారు. ఆత్మలకు అర్థం చేయిస్తారు కదా. భక్తి కన్నా ఈ జ్ఞానము పూర్తిగా అతీతమైనది. ఒక్క భగవంతుడు వచ్చి భక్తులందరికీ ఫలాన్ని ఇస్తారు అన్న గాయనము కూడా ఉంది కదా. అందరూ ఆ ఒక్క తండ్రి పిల్లలే. తండ్రి అంటారు, నేను పిల్లలందరినీ శాంతిధామానికి, సుఖధామానికి తీసుకువెళ్తాను. కల్ప-కల్పము యొక్క ఈ జ్ఞానము కూడా మీకు ఇప్పుడే ఉంది, ఇది అక్కడ ఉండదు. మీరు పతితులుగా అవుతారు కావున పావనులుగా తయారుచేయడానికి తండ్రి మీ వెనుక ఎంత కష్టపడతారు, అందుకే - బలిహారమవుతాను, అర్పణ అవుతాను అని గాయనము ఉంది. ఎవరిపై? తండ్రిపై. వీరు (బ్రహ్మాబాబా) ఏ విధముగా బలిహారమయ్యారు అన్న ఉదాహరణను తండ్రి తెలియజేస్తారు. ఈ శ్యాంపుల్ ను ఫాలో చేయండి. వీరే మళ్ళీ లక్ష్మీ-నారాయణులుగా అవుతారు. ఒకవేళ ఇంతటి ఉన్నత పదవిని పొందాలంటే ఈ విధముగా బలిహారమవ్వాలి. షావుకార్లు ఎప్పుడూ బలిహారమవ్వలేరు. ఇక్కడైతే స్వాహా చేయవలసి ఉంటుంది. షావుకార్లకు తప్పకుండా స్మృతిలోకి వస్తుంది. అంత్యకాలములో ఎవరైతే స్త్రీని స్మరిస్తారో... అన్న గాయనము కూడా ఉంది కదా. ఇంత ధనమంతటినీ ఏమి చేసుకుంటారు. తీసుకునేవారు ఎవరూ ఉండరు ఎందుకంటే అందరూ అంతమైపోనున్నారు. నేను కూడా తీసుకొని ఏమి చేస్తాను. శరీర సహితముగా అంతా అంతమవ్వనున్నది. మీరు మరణిస్తే మీ కోసం ప్రపంచమంతా మరణించినట్లే. ఈ ధనము మొదలైనవేవీ ఉండవు. ఇకపోతే గరుడ పురాణము మొదలైనవాటిల్లో భయపెట్టేందుకు ఎన్నో భయంకరమైన విషయాలను వ్రాసేసారు.

తండ్రి అంటారు, ఈ శాస్త్రాలు మొదలైనవన్నీ భక్తి మార్గానికి చెందినవి. అర్ధకల్పం భక్తి మార్గము నడుస్తుంది, అక్కడ రావణ రాజ్యం ఉంటుంది. రావణుడిని ఎప్పటి నుండి కాలుస్తున్నారు? అని ఎవరినైనా అడిగితే, అప్పుడు వారు పరంపరగా అని అంటారు. అరే, పరంపర నుండైతే రావణుడు ఉండనే ఉండడు. అసలు వారికి తెలియనే తెలియదు కావున పరంపర అని అనేస్తారు. రావణ రాజ్యం ఎప్పటి నుండి ప్రారంభమవుతుంది అనేది ఇప్పుడు పిల్లలైన మీకు స్మృతిలోకి వచ్చింది. రచయిత మరియు రచన యొక్క రహస్యాన్ని కూడా మీరు అర్థం చేసుకుంటారు. ఇప్పుడు తండ్రి అంటారు - పిల్లలూ, నన్నొక్కరినే స్మృతి చేసినట్లయితే పాపాలు అంతమవుతాయి. పరస్పరం ఒకరినొకరు ఈ విషయంలోనే అప్రమత్తం చేసుకుంటూ ఉండండి. పరస్పరం విహరించేందుకు వెళ్ళినప్పుడు కూడా ఈ విషయాలనే మాట్లాడుకోండి. మొత్తం గుంపు అంతా మీ ఈ స్మృతి యొక్క అవస్థలో విహరించినట్లయితే మీ శాంతి ప్రభావం ఎంతగానో పడుతుంది. ఫాదర్లు కూడా ఎంతో సైలెన్స్ లో క్రైస్టు స్మృతిలో వెళ్తారు. వారు ఎటువైపూ చూడరు కూడా. మీరైతే ఇక్కడ ఎంతో స్మృతిలో ఉండవచ్చు, ఇక్కడ మీకు ఏ వ్యాపకాలూ లేవు. చాలా మంచి వాయుమండలం ఉంది. బయటైతే చాలా ఛీ-ఛీ వాయుమండలం ఉంటుంది, అందుకే సన్యాసుల ఆశ్రమాలు కూడా ఎంతో దూరదూరాలలో ఉంటాయి. మీది అనంతమైన సన్యాసము. పాత ప్రపంచం ఇప్పుడు ఇక అంతమవ్వనున్నది. ఇది స్మశానవాటిక, ఇదే మళ్ళీ పరిస్తాన్ గా అవ్వనున్నది. అక్కడ వజ్ర-వైఢూర్యాల మహళ్ళు తయారవుతాయి. ఈ లక్ష్మీ-నారాయణులు పరిస్తాన్ కు యజమానులుగా ఉండేవారు కదా. ఇప్పుడు అలా లేరు. తండ్రి అంటారు, నేను కల్ప-కల్పమూ కల్పము యొక్క సంగమయుగములో వస్తాను. ఈ చక్రమంతా రిపీట్ అవుతూనే ఉంటుంది. ఈ సమయంలో మీకు మొత్తం

స్మృతిలోకి వచ్చింది, ఇప్పుడు తండ్రి స్మృతిని ఇప్పించారు. ఇంతకుముందు బుద్ధిలో ఏమీ ఉండేది కాదు. ఈ స్మృతి యొక్క నషాలో ఎప్పుడైతే ఉంటారో అప్పుడు ఎవరికైనా అంతటి సంతోషముతో అర్థం చేయించగలుగుతారు కూడా. స్మృతిలో ఉంటూ మీరు ఇళ్ళు-వాకిళ్ళను సంభాళించాలి. అచ్ఛా!

సదా స్మృతి యొక్క నషాలో ఉండే మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. డ్రామా యొక్క ఆదిమధ్యాంతాలను మంచి రీతిలో అర్థం చేసుకొని, స్మృతిలో ఉంచుకొని ఇతరులకు కూడా స్మృతిని ఇప్పించాలి. జ్ఞాన అంజనాన్ని ఇచ్చి అజ్ఞానాంధకారాన్ని దూరం చేయాలి.

2. బ్రహ్మాబాబా సమానంగా బలిహారమవ్వడంలో పూర్తిగా ఫాలో చేయాలి. శరీర సహితంగా అన్నీ అంతమవ్వనున్నాయి, అందుకే దానికన్నా ముందే జీవిస్తూ మరణించాలి, తద్వారా అంతిమ సమయంలో ఏమీ గుర్తు రాకుండా ఉంటుంది.

వరదానము:- విశేషతల సంస్కారాలను న్యాచురల్ నేచర్ (సహజ స్వభావం) గా చేసుకొని సాధారణతను సమాప్తం చేసే మరజీవా భవ

ఏదైతే నేచర్ (స్వభావం) ఉంటుందో, అది స్వతహాగా తన పని చేస్తుంది. అక్కడ ఆలోచించాల్సిన, తయారుచెయ్యాల్సిన లేక ఏదీ చెయ్యాల్సిన అవసరం ఉండదు, అంతా స్వతహాగానే జరిగిపోతుంది. అదే విధంగా మరజీవా జన్మధారీ బ్రాహ్మణుల నేచర్ - విశేష ఆత్మల విశేషతకు సంబంధించినది. ఈ విశేషతా సంస్కారాలు న్యాచురల్ నేచర్ గా అవ్వాలి మరియు ప్రతి ఒక్కరి హృదయము నుండి - ఇది నా నేచర్ అని వెలువడాలి. సాధారణత అనేది గతము యొక్క నేచర్, ఇప్పటిది కాదు ఎందుకంటే కొత్త జన్మను తీసుకున్నారు. కావున కొత్త జన్మ యొక్క నేచర్ - విశేషత, అంతేకానీ సాధారణత కాదు.

స్లోగన్:- రాయల్ ఎవరంటే, వారు సదా జ్ఞాన రత్నాలతో ఆడుకుంటారు, రాళ్ళతో కాదు.